క్లుప్తంగా

వాలీబాల్ పోటీ విజేతలకు బహుమతులు ప్రదానం



భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో యంగ్‌స్టార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్‌పోటీల్లో విజేతలైన జట్లకు బహుమతులను, నగదు పురస్కారాన్ని ఆదివారం అందజేశారు. ప్రథమ బహుమతిని బీబీపేట మండలం తుజాల్‌పూర్ జట్టు గెలుచుకుంది. ఈ జట్టు సభ్యులకు రూ.4,000 నగదుతో పాటు మెమెంటోను అందజేశారు. ద్వితీయ బహుమతిని జంగంపల్లి జట్టు గెలుచుకుంది. ఈ జట్టు సభ్యులకు రూ.2,000 నగదుతో పాటు మెమెంటోను అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు కోడూరి సాయగౌడ్, యంగ్‌స్టార్ అసోసియేషన్ ప్రతినిధులు ఈర స్వామి, సతీష్, నవీన్, చరణ్, శశాంక్, మనీష్, నర్సింలు, కమ్మరి రాజు రాజేందర్‌లు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి పనులకు భూమిపూజ



బాన్సువాడ రూరల్: ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ప్రభుత్వ అనుమతి లభించిన లబ్ధిదారులందరూ వెంటనే పనులు ప్రారంభించాలని హన్మాజీపేట్ పంచాయతీ కార్యదర్శి రాజేష్ అన్నారు. గ్రామస్తులతో కలిసి ఖాళీస్థలంలో ముగ్గుపోసి భూమిపూజ చేశారు. ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాల ప్రకారం ఇల్లు నిర్మించుకోవాలన్నారు. మాజీ సర్పంచ్ బోనాల సుభాష్, నాయకులు రంగరిగారి సంజీవులు, బోనాల సాయిలు, బండారి బాలయ్య, వడ్ల శేఖర్, షేక్ అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వెంకటరెడ్డి అన్నారు. తాడ్వాయి మండల కేంద్రంతో పాటు ఆయాగ్రామాలలో ఆదివారం బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. మండలంలో 9 మంది బాధితులకు గాను రూ. 4.50 లక్షలు విలువగల చెక్కులను అందజేశారు. ఎమ్మెల్యే మదన్‌మోహన్ ఆదేశాల మేరకు ఇంటింటికి తిరుగుతూ చెక్కులను అందజేశామన్నారు. కార్యక్రమంలో నాయకులు షౌకత్‌అలీ, శ్యాంరావు, రాంచంద్రం, శ్రీకాంత్, రంజిత్‌రెడ్డి, ఘనిబాయి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సంగమేశ్వర కాలనీలో నీటిసమస్య



బాన్సువాడ రూరల్: మండల కేంద్రంలోని సంగమేశ్వర కాలనీలో కుళాయిల ద్వారా సరిపడా మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. కాలనీలో సరైన పైప్ లైన్ వ్యవస్థ లేకపోవడంతో ఎక్కడో ఓచోట నీటి సమస్య వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది మిషన్ భగీరథ నల్లాల ఛర్రాలు తొలగించడం, మరికొంత మంది మోటార్లు ఏర్పాటు చేసుకోవడంతో ఎగువప్రాంతంలో ఉన్నవారికి నీళ్లు రావడం లేదు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి కాలనీలోని ప్రతి ఇంటికి సరపడా నీటిని సరఫరా చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

పర్మిట్ రూం కాదు.. ప్రయాణ ప్రాంగణమే



నస్రుల్లాబాద్: మండలంలోని సంగం గ్రామంలో గల బస్టాండ్‌ను మందుబాబులు పర్మిట్ రూంగా మారుస్తున్నారు. నిత్యం మద్యం సేవిస్తూ సీసాలు, గ్లాసులు పారేస్తున్నారు. వర్షాకాలం కావడంతో ఆటో, బస్సు కోసం ఎదురు చూసే ప్రయాణికులు బస్టాండ్‌లో కూర్చుందాం అంటే అపరిశుభ్ర వాతావరణం ఉండటంతో నిలవడానికి వీలులేకుండా ఉంది. సంబంధిత అధికారులు స్పందించి బెల్టు షాపులను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.



విక్రయానికి సిద్ధంగా ఉన్న చేపలు



తాడ్వాయిలో బారులు తీరిన ప్రజలు



అంబారిపేటలో..

ఫిష్ మార్కెట్‌లో ఫుల్‌రష్

- మృగశిర కార్తె సందర్భంగా చేపల కోసం బారులు
- పెరిగిన డిమాండ్
- ఎల్లారెడ్డిలో కిలో మొట్ట చేప రూ. 700



బూర్గుల్ చెరువు కట్ట వద్ద చేపల కోసం గుమిగూడిన ప్రజలు



ఎల్లారెడ్డిలో మామిడి పండ్లను కొనుగోలు చేస్తున్న ప్రజలు

నిజాంసాగర్/బీబీపేట/తాడ్వాయి/లింగంపేట/ఎల్లారెడ్డిరూరల్/ఎల్లారెడ్డి/మద్నూర్/కామారెడ్డి అర్బన్/రామారెడ్డి : మృగశిర కార్తె (మిర్గం) సందర్భంగా చేపలు తినాలనే సంప్రదాయం ఉండటంతో జిల్లాలోని గ్రామాల్లోని మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి, ఆదివారం కావడంతో మాంసం ప్రియులతో చేపలతో పాటు చికెన్, మటన్ మార్కెట్లు జనాలతో నిండిపోయాయి. చేపలు కొనడానికి జనాలు ఎగబడ్డారు. చెరువుల్లో మత్స్యకారులు చేపలు పట్టడంతో అక్కడే ప్రజలు చేపలు కోసం బారులు తీరారు. ఈ ఏడాది వర్షాలు సంవృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని ప్రజలు గ్రామదేవతలకు పూజలు చేశారు. అలాగే సాయంత్రం చిన్న పెద్ద తేడా లేకుండా ప్రత్యేకంగా ఇంగువను బెల్లంలో కలిపి నోట్లో వేసుకున్నారు. మొట్ట చేప సాధారణంగా కిలో రూ. 400 ఉంటే వాటి ధరను అమాంతంగా రూ. 700 నుంచి 800 పెంచి ఎల్లారెడ్డిలో విక్రయించారు. ఎల్లారెడ్డిలో మామిడి పండ్లకు గిరాకీ బాగా పెరిగింది. మృగశిర కార్తె సందర్భంగా వెజిటేరియన్లు మామిడి పండ్ల పానకంతో పాటు అట్ల(దోశె)ను భుజిస్తారు. కిలో రూ. 50 ఉన్న మామిడిపండ్లు రూ. 70 నుంచి 80 పెంచి విక్రయించారు. రామారెడ్డి గ్రామానికి చెందిన పొట్టి గారి విజయ్ అనే గంగపుత్ర యువకుడికి ధర్మారు చెరువులో వలకు 10 కిలోల తెల్లచేప చిక్కింది. ప్రస్తుతం మార్కెట్లో కిలో తెల్ల చేపల ధర రూ. 200 పైన పలుకుతుంది.



10 కిలోల భారీ చేపతో మత్స్యకారుడు



ఎల్లారెడ్డిలో..



మద్నూర్‌లో..



కామారెడ్డిలో సుభాష్ విగ్రహం వద్ద..

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



లింగారెడ్డిపేటలో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు



ఎల్లారెడ్డిలో..



సంగోజీపేట్‌లో..

ఎల్లారెడ్డి/ఎల్లారెడ్డిరూరల్/బాన్సువాడ రూరల్ : చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ప్రభుత్వ ఉపాధ్యాయులు అన్నారు. ఆదివారం ఎల్లారెడ్డి పట్టణంలో, ఎల్లారెడ్డి మండలంలోని పలు గ్రామాల్లో, బాన్సువాడ మండలం కోనాపూర్, సంగోజీపేట్, పులిగుండుతండాల్లో పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్యతో పాటు, యూనిఫాం, పుస్తకాలు, నోటు బుక్కులు, మధ్యాహ్న భోజనం అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులు, అంకితభావం కలిగిన ఉపాధ్యాయులు ఉంటారని, నాణ్యమైన విద్య అందుతుందని కోనాపూర్ జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శేఖర్ అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

ఇరుకు రహదారితో ఇబ్బందులు



కామారెడ్డి అర్బన్: జిల్లా కేంద్రమైన కామారెడ్డి నిజాంసాగర్ చౌరస్తాను గత ఐదేళ్ల క్రితం మూసివేసి కాస్తా ముందుకు రైల్వే వంతెన రోడ్డుకు ఎదురుగా యూ టర్న్ పెట్టడంతో బస్సులు, భారీ వాహనదారులు ఇరుకు మలుపులో ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఎల్లారెడ్డి, నిజాంసాగర్ వైపు వచ్చే బస్సు డ్రైవర్ల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఒక్కోసారి బస్సును మలుపడానికి ట్రాఫిక్‌లో వెనుకకు ముందుకు తీసుకుంటూ ఇబ్బందులు పడుతున్నారు. నిజాంసాగర్ చౌరస్తాలో యూ టర్న్‌ను వెంటనే తెరిపించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్డుపై పడిన చెట్టు.. తొలగించిన పోలీసులు



మద్నూర్(జుక్కల్): మండలంలోని రుసేగావ్ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై ఆదివారం భారీ ఈదురుగాలులు వీయడంతో చెట్టు రోడ్డుపై కూలిపోయింది. అటు వెళ్తున్న మద్నూర్ ఎస్సై విజయ్ కొండ, పోలీసు సిబ్బంది గమనించారు. దీంతో వారు రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్టును పక్కకు తొలగించారు. పోలీసులు చేసిన పనిపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

ఘనంగా ఎడ్లబండ్ల ప్రదర్శన



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని కన్నాపూర్, కోమట్‌పల్లి, పర్మళ్ల గ్రామాల్లో మృగశిరకార్తె సందర్భంగా ఆదివారం గ్రామ దేవతలకు ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు ఎడ్లబండ్లను రంగులతో, మామిడి తోరణాలు, కొత్త చీరలతో అలంకరించారు. గ్రామాల్లోని ప్రధాన వీధుల గుండా డప్పు వాయిద్యాలతో ఊరేగించారు. అనంతరం దుర్గమ్మ, గ్రామ దేవతల అలయాల చుట్టూ ఐదుసార్లు ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పిల్లాపాపలు చల్లగా ఉండాలని, పాడి పంటలు సంవృద్ధిగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, పిల్లలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కరెంట్ వైర్లను సరిచేయండి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని చీనూర్ గ్రామశివారులో వ్యవసాయ భూముల్లో విద్యుత్‌వైర్లు కిందికి వేలాడతున్నాయి. పంటపొలాలకు వెళ్లే రైతులకు చేతికందే ఎత్తులో కరెంట్‌వైర్లు ఉండడంతో రైతులకు, పశువులకు ప్రమాదం పొంచిఉంది. అధికారులు స్పందించి కరెంట్ వైర్లను సరిచేయాలి.

– మ్యాకల నారాయణ, చీనూర్

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

కామారెడ్డి : 94942 60200 | ఎల్లారెడ్డి : 97053 46576 | బాన్సువాడ : 94402 11363 | జుక్కల్ : 97053 46578

ప్రతిభా పరీక్షల్లోనూ 'ఆదర్శం'

- ఎన్ఎంఎంఎస్‌కు కొత్తబాది మోడల్‌స్కూల్ నుంచి 10మంది విద్యార్థులు ఎంపిక
- ఏటా రూ.12 వేల స్కాలర్‌షిప్



కొత్తాబాదిలోని మోడల్‌స్కూల్

బాన్సువాడ రూరల్: ఎస్సెస్సీ, ఇంటర్మీడియేట్ పరీక్షల్లోనే కాకుండా ప్రభుత్వం నిర్వహించే వివిధ ప్రతిభా పరీక్షల్లోనూ మంచి మార్కులు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు కొత్తాబాది మోడల్‌స్కూల్ విద్యార్థులు. ఈఏడాది నిర్వహించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)కు ఈస్కూల్ నుంచి ఏకంగా 10మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యే పేద విద్యార్థులు ఉన్నత చదువుకు దూరం కాకుండా, వారిలో చైతన్యం నింపేందుకు కేంద్రప్రభుత్వం ఈస్కీంను నిర్వహిస్తోంది. ఈస్కూల్‌లో 8వ తరగతి చదివే విద్యార్థులు ప్రతిఏటా నిర్వహించే పరీక్షలో ప్రతిభ కనబర్చి స్కాలర్‌షిప్‌కు ఎంపికవుతూ వస్తున్నారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులకు ప్రతి సంవత్సరం రూ.12వేల చొప్పున నాలుగేళ్లపాటు కేంద్రప్రభుత్వం ద్వారా ఆర్థిక సాయం అందుతుంది. జాతీయ స్థాయిలో జరిగే పోటీ పరీక్షల్లో స్కూల్ విద్యార్థులు సత్తా చాటుతున్నారు. ఇటీవల ప్రకటించిన ఎస్సెస్సీ , ఇంటర్ ఫలితాల్లో విద్యార్థులు మెరుగైన ప్రదర్శన కనబర్చారు.

ప్రత్యేక తరగతులు



రెగ్యులర్ తరగతులతో పాటు పోటీ పరీక్షల్లో విద్యార్థులు నెగ్గడానికి ఉపాధ్యాయ బృందం కృషి చేస్తోంది. పోటీ పరీక్షలకు సంబంధించిన సిలబస్‌పై ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ కొన్ని నెలల పాటు సాధన చేయిస్తున్నాం. ప్రశ్నల సాధన, ఓఎంఆర్ షీట్లు నింపే విధానంపై అవగాహన కల్పిస్తుండటంతో విద్యార్థులు ఎంపికవుతున్నారు.

– కమల్‌కిషోర్, ప్రిన్సిపల్, మోడల్‌స్కూల్, కొత్తాబాది

ఆధ్యాత్మికం

భక్తులతో కిటకిటలాడిన సిద్ధరామేశ్వరాలయం



భిక్కనూరు: దక్షిణ కాశీగా పేరొందిన భిక్కనూరు సిద్ధరామేశ్వరాలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజామునుంచే భక్తులు ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. మరికొందరూ భక్తులు అభిషేకాలు అర్చనలు గండదీపాలు, అన్నపూజ సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరించారు. కొందరూ తమ చిన్నారులకు అన్నప్రసాన కార్యక్రమాలను జరిపించారు.ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయం ప్రాంగణం ఓం నమఃశివాయ పంచాక్షరి మంత్రంతో మారుమ్రోగింది.వేదబ్రాహ్మణులైన సిద్ధగిరిశర్మ, రామగిరిశర్మ, రాజేశ్వరశర్మలు భక్తులచేత స్వామి వారికి మాత భువనేశ్వరీ దేవికి ప్రత్యేక పూజలు అర్చనలను కుంకుమ పూజలను చేయించారు.

15న ఇస్కాన్ ఆధ్యాత్మిక కార్యక్రమం

కామారెడ్డి అర్బన్: అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో ఈనెల 15న సిరిసిల్లరోడ్డులోని శ్రీకన్యకాపరమేశ్వరి ఫంక్షన్ హాల్‌లో 'ఆనంద ఆలయం' ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కామారెడ్డి సెంటర్ ఇన్‌చార్జి వెంకట ప్రభు తెలిపారు. ముఖ్య అతిథి, వక్తగా ప్రణవనంద దాసు పాల్గొంటారని పేర్కొన్నారు.

నేడు కల్కి కల్యాణోత్సవం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి నిజాంసాగర్‌రోడ్డులోని శ్రీకల్కి భగవతి భగవాన్ కల్యాణం సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. కల్యాణం అనంతరం దివ్యమంగళ దర్శనం,అన్నప్రసాదం ఉంటుందన్నారు.

రోడ్డు మార్గంలో అడ్డంగా ముళ్లపొదలు



కుర్లా సమీపంలో రోడ్డుపై ముళ్లపొదలు

మద్నూర్(జుక్కల్): ఉమ్మడి మద్నూర్ మండలంలోని పెద్ద తడ్గూర్, కుర్లా, ఎన్‌బురి తదితర గ్రామాలకు వెళ్లే రోడ్డు మార్గంలో అడ్డంగా ముళ్లపొదలు పెరిగాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మార్గంలో అడ్డుగా ఉన్న ముళ్లపొదలను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

ఖాళీ స్థలంలో జాలీగా చిన్నారుల క్రికెట్



క్రికెట్ ఆడుతున్న చిన్నారులు

నిజాంసాగర్(జుక్కల్): గ్రామీణ ప్రాంతాల్లో ఆటలకు మైదానాలు లేకపోవడంతో పంటపొలాలు క్రీడా మైదానాలుగా మారుతున్నాయి. ఆదివారం మండలంలోని నర్సింగ్‌రావ్ పల్లి గ్రామ శివారులోని పంట పొలాల్లో చిన్నారులు క్రికెట్ ఆడుతుండగా ఈచిత్రాన్ని సాక్షి క్లిక్ మనిపించింది.

సంక్షిప్తం

రజక సంఘం ఫంక్షన్ హాలుకు రేకులు అందజేత



బీబీపేట: ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఇచ్చిన హామీ మేరకు మండల కేంద్రంలోని రజక సంఘం ఫంక్షన్ హాలుకు, మల్కాపూర్ గ్రామ ఎస్సీ మాదిగ సంఘం ఫంక్షన్ హాలుకు ఆదివారం బీజేపీ నాయకులు రేకులను అందజేశారు. ఫంక్షల్ హాలులకు రేకులను అందజేయడంతో సంఘం సభ్యులు ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘం సభ్యులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాల ప్రతిష్ఠాపన కోసం అనుమతి ఇవ్వాలి



బీబీపేట: మండలంలోని జనగామ మర్రి వద్ద మహనీయుల విగ్రహాల ప్రతిష్ఠాపన కోసం అనుమతి ఇవ్వాలని కోరుతూ అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో నాయకులు ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ సలహాదారులు షబ్బీర్ అలీ, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు సురేష్ షెట్కార్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రధాన కూడలిలో ఛత్రపతి శివాజీ మహరాజ్, అంబేడ్కర్, జ్యోతిబా పూలే విగ్రహాల ప్రతిష్ఠాపనకు అనుమతి ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు భూమా గౌడ్, పరకాల రవి, అంబేడ్కర్ సంఘం నాయకులు ఆకుల బాబు, రాజబాబు, పాత స్వామి, జనగామ గణేష్, జాలిగామా నాంపల్లి రాజు, ఆకుల దయాకర్, పాత అశోక్, దినేష్, రామచంద్రం, నాని గోపి, రాజు తదితరులు పాల్గొన్నారు.

జీపీ బోరు మరమ్మతులకు డబ్బుల వసూలు..?

సదాశివనగర్: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో 12, 13 వార్డులకు నీటిని అందించే బోరు మరమ్మతుల కోసం ఓ అదే కాలనీకి చెందిన అధికార పార్టీ నాయకుడు కాలనీ వాసుల నుంచి డబ్బుల వసూలు చేస్తున్నారని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. డబ్బులు ఇవ్వకుంటే ఈ బోరు నుంచి నీళ్లు తీసుకుపోవద్దని బెదిరింపులకు గురి చేస్తున్నట్లు కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఎంపీవో సురేందర్ రెడ్డి వివరణ కోరగా..ఆ కాలనీ పరిధిలో ఉన్న బోరు గ్రామ పంచాయతీకి సంబంధించినదని.. ఏదైనా మరమ్మతులు ఉంటే గ్రామ పంచాయతీ దృష్టికి తీసుకొస్తే పరిశీలించి బోరకు మరమ్మతులు చేయిస్తామన్నారు. ఎవరు కూడా ఒక్క పైసా కూడా ఇవ్వ వద్దని సూచించారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.